క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంఈఓగా శ్రీనివాసులు



పాన్‌గల్: పాన్‌గల్ ఇన్‌చార్జీ ఎంఈఓగా మండల నోడల్ ఆఫీసర్, కేతేపల్లి జీహెచ్‌ఎం శ్రీనివాసులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన ఇన్‌చార్జీ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతో మండలంలో విద్యా అభివృద్ధి, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎంఈఓకు సన్మానం

ఎంఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులను కేతేపల్లి పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల విద్యా వ్యవస్థను ప్రగతి పథంలో నడిపిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొస్తారని వారు ఆశాభవం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఎమ్మార్సీ కార్యాలయం సిబ్బంది నూతన ఎంఈఓ శాలువాతో కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, గోవింద్, శేఖర్‌నాయక్, మూర్తి పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా వాకిటి లక్ష్మి

మదనాపురం: సీపీఎం అజ్జకొల్లు గ్రామ కార్యదర్శిగా బుధవారం వాకిటి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు రేణుక, భాగ్య, హరిత, లక్ష్మి, చిన్నమ్మ, జమున, రమాదేవి, సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌రాములు, ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, గ్రామ కార్యదర్శి మణివర్ధన్, చెన్నయ్య, చిరంజీవి, సత్యన్న, తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



వీపనగండ్ల: మండల విద్యాధికారిగా నర్సింహ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. మండలంలోని గోవర్ధనగిరి పాఠశాల జీహెచ్‌ఎంగా పనిచేస్తున్న నరసింహకు పూర్తి స్థాయి మండల విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించారు. మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు బాధ్యతగా పనిచేస్తానని ఎంఈఓ అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వీపనగండ్ల జీహెచ్‌ఎం భానుప్రకాశ్, ఉపాధ్యాయులు ఆనంద్‌రెడ్డి, సాయిలత, సంధ్యారాణి, రాజస్వప్న, కృష్ణయ్య, శరత్, ఎమ్మార్సీ సిబ్బంది వెంకటేష్, రాములు, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాలు ప్రకటించాలి

వనపర్తి రూరల్: ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను వెంటనే ప్రకటించి, ఖాళీలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, కార్యదర్శి ఎండీ కుతుబ్ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి పట్టణంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జూన్12న పాఠశాలలు ప్రారంభమైన నాటి నుంచి ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించినా.. ఇంకా ఫలితాలు మాత్రం ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఫలితాలు ప్రకటించకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు

వనపర్తి రూరల్: జిల్లా వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. బుధవారం పెబ్బేరు మండల కేంద్రంలోని స్వర్ణభారతి కళాశాలలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విదార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ధ్వజమెత్తారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా అంజి, కో కన్వీనర్‌గా లక్ష్మణ్, కమిటీ సభ్యులుగా మహేష్, శివ, వెంకటేష్, శివకోటి, సందీప్ ఎన్నుకున్నారు.

డీసీఎం బోల్తా

వనపర్తి రూరల్: కర్నూల్ వైపు నుంచి చేపల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వాహనం బుధవారం తెల్లవారుజామున పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి గ్రామ శివారులో ఎన్‌హెచ్44 రోడ్డుపై బోల్తా పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి భారీగా చేరుకొని చేపలు పట్టుకెళ్లారు. ప్రమాదంలో డీసీఎంలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

‘స్వచ్ఛత’ అందరి బాధ్యత



వీపనగండ్లలో పచ్చదనంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ తడి, పొడిచెత్త గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

నేడు కార్మికులకు వైద్యశిబిరం

గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్మికులకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి తెలిపారు.

అమరచింత: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, స్థలాలు, కార్యలయాలు, అలయాలు, ప్రార్థన మందిరాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా ప్రజలకు స్వచ్ఛత గురించి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల ప్రత్యేక అధికారులు నిరంతరం స్వచ్ఛత కార్యక్రమాలపై దృష్టి సారించడంతో మురుగుకాల్వలు, పరిసరాల పరిశుభ్రత, బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేపట్టడం వంటివి నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు.

పాన్‌గల్: పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం పరిసరాలల్లో చేపట్టిన శ్రమదానం పనులను ఆయన పరిశీలించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పారిశుద్ధ్య నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, తడి, పొడి చెత్త వేరు చేయు విధానం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పరిరక్షించాలి

వీపనగండ్ల: మొక్కలు విరివిగా నాటి పచ్చదనాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాల ఆవరణలో అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయిలత, పంచాయతీ కార్యదర్శి దర్గయ్య అన్నారు. ఉపాధ్యాయులు కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, ఎల్లమ్మ, మహేశ్వరి, పలువురు పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంతో పాటు బుద్దారం, పొలికెపాడు గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మండల కేంద్రానికి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా శ్రమదానం చేశారు. బుద్దారం గ్రామంలో తడి, పొడి చెత్తను వేరుగా వేయడంపై అవగాహన కల్పించారు. ఎంపీఓ సుదర్శన్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దగుడెం తండా ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ రాఘవతో పాటు ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు.



పాన్‌గల్‌లో శ్రమదానం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోవిందరావు



అమరచింత మండలం పాంరెడ్డిపల్లిలో..



మూలమళ్లలో..

అంగన్‌వాడీ చిన్నారుల ప్రకృతి సందర్శన



చిన్నారులకు మొక్కల గురించి చెబుతున్న అంగన్‌వాడీ టీచర్

అమరచింత: అంగన్‌వాడీలో చదువుకుంటున్న చిన్నారులకు బుధవారం ప్రకృతి సందర్శన కార్యక్రమం ద్వారా పండ్ల మొక్కలు, కూరగాయల తోటలను చూపించినట్లు అంగన్‌వాడీ టీచర్ రాధిక తెలిపారు. పట్టణంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రకృతి సందర్శన కార్యక్రమం చేపట్టారు. చిన్నారులకు పౌష్టిక పదార్థాలను అందించడమే కాకుండా ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామన్నారు. చదువులో భాగంగానే మన పరిసరాల్లో ఉన్న పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను చూపడంతో పాటు వాటి పేర్లను చెప్పడం పాటు వారితో చెప్పించడం వంటి కార్యక్రమం నిర్వహించామన్నారు.

శుభ్రతతో రోగాలు దూరం



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

వీపనగండ్ల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా అంటువ్యాధుల బారినపడకుండా ఉంటారని మండల వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ఆయన పాల్గొని బాలికలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల ఆవరణలో దోమలు నివాసం ఉండే ప్రాంతాలను వెంటనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ఎస్‌ఓ అరుణ, సూపర్‌వైజర్ విజయకుమారి, ఎంపీహెచ్‌ఏ జాంగీర్, ఏఎన్‌ఎం రామచంద్రమ్మ, పలువురు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గోపాల్

ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని, తమ తల్లిదండ్రులు, గురువులకు, గ్రామానికి పేరును తీసుకురావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా విద్యార్థుల ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, గిరీధర్, అంజలన్న, విద్యార్థులు పాల్గోన్నారు.

విద్యావ్యవస్థను కాపాడటమే లక్ష్యం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సాహితీ కళావేదిక ప్రతినిధులు

వనపర్తిటౌన్: జిల్లాలో విద్యా వ్యవస్థను కాపాడటమే లక్ష్యంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ తరఫున చిత్తశుద్ధితో పనిచేస్తామని జీహెచ్‌ఎంఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి అన్నారు. బుధవారం సాయంత్రం సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నూతనంగా ఎన్నికైన జీహెచ్‌ఎంఏ కార్యవర్గం అభినందన సభలో వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతి, విద్యా వ్యవస్థ పటిష్టం కావాలనే లక్ష్యంతోనే ప్రతి అడుగు ముందుకేస్తామని, స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థి మీద రూ.వేలు ఖర్చు పెడుతుందని, ఆ ప్రజాధనాన్ని సద్వినియోగం చేయడంలో ప్రతి హెడ్మాస్టర్ అంకితభావంతో పని చేయాలని అభిప్రాయపడ్డారు. వ్యవస్థ బాగుకోసం కఠిన నిర్ణయాలు కొన్ని సందర్భాల్లో తప్పవని గుర్తుచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులది పెద్దన్న పాత్ర అని చెప్పారు. సహచర ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పాఠశాల పరిరక్షణకు, విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేష్‌కుమార్, శంకరయ్య, కురుమన్న, ఉమాదేవి, సరస్వతి, బైరోజు చంద్రశేఖర్, సాహితీ కళా వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఆరుద్ర పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ఉదయం నుంచి అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని శివలింగానికి పాలాభిషేకం, పుష్పాభిషేకాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



అమరచింత: వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్‌ఏలు బుధవారం తహసీల్దార్ రమేష్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీఓలు 81, 85, 98 వలన పదోన్నతులు పొంది తక్కువ సర్వీస్ చేసి ఎటువంటి లబ్ధి పొందకుండా రిటైర్మెంట్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఆశమ్మ, లక్ష్మమ్మ, ఆశన్న పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



కొత్తకోట: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కొత్తకోటకు వచ్చిన సందర్భంగా ఆయనను బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పట్టణంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా కానాయపల్లి శంకరసముద్రం భూనిర్వాసితులకు న్యాయం చేయాలని ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వారికి న్యాయం చేయాలని కోరారు.

‘కుక్కల బెడదను నివారిస్తాం’

వనపర్తిటౌన్: పట్టణంలో స్వైర విహారం చేస్తున్న కుక్కల బెడదను నిర్మూలించి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుక్కలను పురపాలిక ప్రత్యేక వాహనంలో ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించి తగిన శస్త్ర చికిత్సలు నిర్వహించి సంతాన ఉత్పత్తి కాకుండా చూస్తామన్నారు. ప్రతి కుక్కకు శస్త్ర చికిత్స చేసేందుకు రూ.1,650 ఖర్చ చేయనున్నట్లు, ఇందుకోసం గతేడాది టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని వెల్లడించారు. వనపర్తిలో మొత్తంగా 3,383 కుక్కలు ఉన్నట్లు గుర్తించామని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎనిమల్ కేర్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలకు అవసరమైన వాటర్, లైటింగ్, కెనల్స్ సౌకర్యాలను సమకూర్చామని ఒకట్రెండు రోజుల్లోనే కార్యాచరణ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు.

నేడు వైద్య శిబిరం

అమరచింత: స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం పంచాయతీ కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

తల్లిదండ్రులను వేధిస్తే జైలుకే..



వృద్ధురాలు, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

పాన్‌గల్: తల్లిదండ్రులను వేధించడం కానీ, వారి పోషణ చేయకపోయినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని చింతకుంటకు చెందిన వృద్ధురాలు కరోల శంకరమ్మను వారి కుమారులు, కోడళ్లు ఇంటి నుంచి బయటికి పంపించడంతో గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో ఉంటుందనే విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బుధవారం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. కుమారుడిని, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి వృద్ధురాలిని ఇంటికి పంపించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల పట్ల ప్రేమగా వ్యవహరిస్తూ, వారికి పోషణ చేయాలని, బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకొని తల్లిదండ్రులకు న్యాయం చేస్తామన్నారు. కోడళ్లతో అప్పుడు, అప్పుడు ఘర్షణ పడి అలిగిపోయి కమ్యూనిటి హాల్‌లో కూర్చున్నది తప్ప ఇంటి నుంచి బయటకు పంపించలేదని, కొందరూ మాకు గిట్టని వారు కావాలని సోషల్ మీడియాలో పోస్టు చేసి తప్పుడు ప్రచారం చేశారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

కొత్తకోట రూరల్: పెబ్బేరు పట్టణంలోని చెలిమిళ్ల (కిష్టరెడ్డిపేట)కు చెందిన గౌడ్ లు బుధవారం కొత్తకోట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కల్లు విక్రయించేందుకు, కల్లు గీసేందుకు ఏడుగురు లైసెన్స్ కలిగి ఉండగా.. సంఘంలో మొత్తం 114మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుత సభ్యుల్లో 80మంది ఒక గ్రూపుగా, 34మంది మరో గ్రూపుగా విడిపోయారు. ఇలా రెండు గ్రూపులుగా విడిపోవడంతో రెండేళ్లుగా కల్లు అమ్మకాలు జరుగడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో కొత్తకోట ఎక్సైజ్ సీఐ ఓంకార్, ఈఎస్‌కు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న 120 కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామంటూ న్యాయం చేయాలని కొత్తకోట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోని కల్లుగీత సొసైటీలోని అందరి సభ్యులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బస్సులు ఆపాలని రాస్తారోకో



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్

ఆత్మకూర్: గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పిన్నంచర్ల గ్రామస్తులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. పిన్నంచర్ల గేటు వద్ద రోడ్డుపై గ్రామస్తులు బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. స్టాప్ వద్ద బస్సు ఆపకపోవడంతో ఆత్మకూర్‌కు వెళ్లాలంటే రెండు కిలో మీటర్ల మేర నడవాల్సివస్తుందని మండిపడ్డారు. ఇక్కడి నుంచి చింతకుంట, మహబూబ్ నగర్‌కు వెళ్లాలన్న ఆత్మకూర్‌కు వెళ్లి బస్సులెక్కి తిరిగి రావాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ శివకుమార్ మహబూబ్‌నగర్ డీఎంతో మాట్లాడి బస్సులు పిన్నంచర్ల గేట్ వద్ద ఆపాలని సూచించారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

‘అభివృద్ధి కోసం బీజేపీలో చేరుదాం’



మామిడిమాడలో బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న లోక్‌నాథ్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీలో చేరాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మామిడిమాడ, పర్వతాపురం తదితర గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో దూసుకుపోవడానికి కారణం బీజేపీ అధికారంలో ఉండటమే అన్నారు. నిరంతరం ప్రజల కోసం తపించే ప్రధాని మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవినాయక్, విక్రం, సత్యనారాయణ, గోపాల్, రాజు, కేశన్న పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో సమర్థవంతమైన పాలన అందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు. అదేవిధంగా పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లితండాలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ పార్టీ సభ్యత్వాలు చేయించారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, మాధవరెడ్డి, రామన్‌గౌడ్, వెంకటస్వామి, భాస్కర్, మధు నాయుడు, మహేష్, నరసింహనాయుడు, బీచుపల్లి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములవ్వండి

వీపనగండ్ల: దేశం కోసం, ధర్మం కోసం, వికసిత్ భారత్ కోసం పనిచేస్తున్న నరేంద్రమోదీకి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సభ్యత్వ నమోదు జోనల్ ఇన్‌చార్జ్ ధర్మారావు అన్నారు. బుధవారం గోవర్ధనగిరిలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కాల రామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాకేష్, ప్రధాన కార్యదర్శి నారాయణ, మధు, రాణాప్రతాప్, జగదీశ్‌గౌడ్, కుర్మయ్య, ఆంజనేయులు, రాజు, నరేష్, కుర్మయ్య, గణేష్, పులేందర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి

వనపర్తిటౌన్: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 52వ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాయకులు నరేంద్రరావు, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణంలో బీజేపీ నాయకులు పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భరత్‌భూషణ్, ఎస్.వెంకట్‌రెడ్డి, సాయిరాం, దాబ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్మీ బాలస్వామి, ప్రహ్లాద, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, గందు రవీందర్‌గౌడ్, నాగరాజుయాదవ్, మన్యం, లెమెన్ శ్రీను, బాలు, రఘురెడ్డి, తిరుపతిసాగర్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

వనపర్తి రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాదరావు అన్నారు. పెబ్బేరు మండలంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో బుదవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, బౌద్ధారెడ్డి, సూర చంద్రశేఖర్, రవీందర్‌గౌడ్, శివశంకర్, మండల అధ్యక్షుడు దయానంద్, దుర్గాప్రసాద్, జయంత్‌రెడ్డి, దామోదర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ తహసీల్దార్‌గా చాంద్‌పాషా



ఆత్మకూర్: స్థానిక తహసీల్దార్ రాజు వనపర్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ కావడంతో వనపర్తి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న చాంద్‌పాష బదిలీపై ఇక్కడకు రానున్నారు. తహసీల్దార్ రాజు బుధవారం రిలీవ్ అయ్యి వనపర్తిలో విధుల్లో చేరగా.. తహసీల్దార్ చాంద్‌పాష గురువారం బాధ్యతలు తీసుకోనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గాయపడిన కావ్య

గోపాల్‌పేట: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినికి బుధవారం తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని రేకులగడ్డ కాలనీకి చెందిన ఆంజనేయులు కుమార్తె కావ్య స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత కావ్య అందరితో కలిసి బస్టాండుకు వెళ్లింది. రేకులగడ్డ కాలనీకి వెళ్లేందుకు గోపాల్‌పేట బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో బస్సు ముందుకు కదిలింది. దీంతో కావ్య బస్సు కింద పడిపోయింది. బస్సు వెనక టైర్ విద్యార్థిని కాలికి సమీపంలోకి వచ్చి ఆగడంతో.. వెంటనే అప్రమత్తమైన ప్రజలు కావ్యను బయటకు లాగి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి ఎక్స్‌రే తీయించేందుకు వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రయాణికులు ఎక్కకముందే డ్రైవర్ బస్సును ముందుకు కదిలించడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.